మరమ్మతు పనులను పరిశీలిస్తున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి పనులు

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్, మే 29 : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు పనులు చేపట్టినట్లు కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. భూపాలపల్లి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మత్తు పనులను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి గ్రామీణ ప్రాంతాల్లోని 22 పాఠశాలల్లో సుమారు రూ.1.60 కోట్లతో మౌలిక సదుపాయాల పనులు చేపట్టినట్లు తెలిపారు. పెద్దాపూర్ పాఠశాలలో రూ.12.25 లక్షలు, నేరేడుపల్లిలో రూ.15.27 లక్షలు, వజినేపల్లి 4.87 లక్షలు, రాంపూర్ పాఠశాలలో రూ.6 లక్షలతో చేపట్టిన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి సంపూర్ణంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. నిధుల కొరత రాకుండా, పనులకు ఆటంకాలు లేకుండా ఉండేందుకు మహిళా సంఘాలకు అంచనా ప్రతిపాదనల మేరకు 25 శాతం ముందస్తు నిధులు మంజూరు చేశామని తెలిపారు. పూర్తయిన పనులకు బిల్లులు చెల్లిస్తామని, లెక్క పక్కాగా ఉండాలని, రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. పాఠశాల మైదానాలు ఎత్తు పల్లాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు ఉపాధిహామీ పథకం నిధులు ద్వారా చదును చేయాలని, స్థలం ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సురేశ్‌కుమార్, ఎంపీవో నాగరాజు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం, తదితర అంశాలపై వైద్య, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 63 ఉప ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టగా 17 పూర్తి కాగా, 23 పురోగతిలో ఉన్నాయని, 9 నిధుల సమస్యతో ప్రారంభం కాలేదన్నారు. ఏడు చేపట్టాల్సి ఉండగా మరో ఏడు చోట్ల స్థల సమస్య ఉన్నట్లు తెలిపారు. వీటిలో 47 జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో చేపట్టామని, డీఎంఎస్టీ నిధులతో చేపట్టిన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. బాగిర్తిపేట, చెన్నాపూర్, చిన్నకోడెపాక, రంగయ్యపల్లిలో చేపట్టిన నిర్మాణ పనుల్లో జాప్యానికి కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేయాలని, బుద్ధారం, చల్లగరిగలో శిథిలావస్థలో ఉన్న భవనాలు తొలగించాలని ఆదేశించారు. స్థల సమస్య ఉన్న వాటికి రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని, తాడిచర్ల, మహాముత్తారంలో నిర్మిస్తున్న డాక్టర్ల నివాస గృహాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, టీజీఎండీసీ డీఈ నాగిరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'పద్మ' అవార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

కృష్ణకాలనీ, మే 29 : భారత ప్రభుత్వం వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందించనున్న 'పద్మ' అవార్డుల కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, ఆటలు, సంఘ సేవ, విద్య, విజ్ఞాన, శాస్త్ర, సాంకేతిక, పరిశ్రమలు, వ్యాపారం తదితర రంగాల్లో విశిష్టమైన సేవలకు సంబంధించిన పేపర్ క్లిప్పింగ్స్, ఫొటోలు (నాలుగు సెట్లు) జత చేసి జూన్ 4న కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ 25లో గల జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

కాటారం, మే 29 : కాటారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను గురువారం ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు సీఐ నరేందర్ తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు స్టేషన్‌కు వచ్చి వాహనాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

నాసిరకంగా బీటీ రోడ్డు నిర్మాణం

- సైడ్ బర్మ్‌లు మరిచిపోయిన వైనం
- వానలు పడితే రూ. 1. 20 కోట్లు వృథా
- పనులపై లోపించిన పర్యవేక్షణ

ములుగురూరల్, మే 29 : ములుగు మండలం నౌశ్యతండాకు నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టారు. రవాణా పరంగా తమకు ఇబ్బందులు తొలగడంతో పాటు సౌకర్యవంతంగా ఉంటుందని భావించిన గ్రామస్తులకు రోడ్డు పగుళ్లు నిరాశకు గురిచేశాయి. ఏప్రిల్‌లో ఐటీడీఏ నుంచి రూ.1.20 కోట్లతో 1.5కిలో మీటర్ల మేర రోడ్డును శివతండా నుంచి నౌశ్యతండా వరకు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రామతీర్థం గ్రామానికి చెందిన జీఎల్‌సీసీఎస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన కాంట్రాక్టర్ పనులను చేపట్టాడు. గిరిజన సంక్షేమ శాఖ, ఇంజినీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు తూతూ మంత్రంగా పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణంలో రోలింగ్ సరిగా చేయకపోవడంతో అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. చూపుకు రోడ్డు మంచిగానే కనిపించినా నాణ్యత విషయంలో డొల్లతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. రోడ్డుకు ఇరువైపులా మూడు ఫీట్ల మేర మట్టితో సైడ్ బర్మ్‌లు పోయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ బీటీతో పాటు కంకర, మట్టి సైతం కొట్టుకుపోయింది. ఉన్నతాధికారులు స్పందించి పనుల విషయంలో చర్యలు తీసుకోకపోతే వర్షాకాలంలో బీటీ రోడ్డు మొత్తం పనికి రాకుండా పోయే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయమై గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఏఈ ప్రణీతను వివరణ కోరగా సైడ్ బర్మ్‌లు పోయినట్లు తమ దృష్టికి వచ్చిందని, కాంట్రాక్టర్‌తో సైడ్ బర్మ్‌లు పోయించిన తర్వాతే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. శివతండా నుంచి నౌశ్యతండా వరకు వాహనాల రాకపోకలు ఎక్కువగా లేకపోవడంతో బీటీ రోడ్డుకు సరైన రీతిలో రోలింగ్ జరుగనందున అక్కడక్కడ బీటీ రోడ్డుకు పగుళ్లు వచ్చి కనిపిస్తున్నట్లు ఆమె చెప్పారు.

సైడ్ బర్మ్‌లు లేకుండా ఉన్న నౌశ్యతండా బీటీ రోడ్డు

బీటీ రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు

కాటారం : విత్తన డీలర్లకు సూచనలు చేస్తున్న కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

రైతులను మోసం చేయొద్దు

- నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు
- కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు రామ్మోహన్‌రెడ్డి, సంపత్ రావు

భూపాలపల్లి రూరల్/ కాటారం, మే 29 : రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నాసిరకం, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు రామ్మోహన్‌రెడ్డి, సంపత్‌రావు అన్నారు. బుధవారం వారు కాటారం మండల కేంద్రంలోని రైతు వేదిక, భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నకిలీ విత్తనాల సరఫరా నియంత్రణపై వ్యవసాయ, పోలీస్ అధికారులు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో డీఎస్పీలు మాట్లాడారు. రైతులకు విత్తనాలు, పురుగు మందులు అమ్మితే షాపు యజమానులు రసీదులు ఇచ్చేలా చూడాలన్నారు. తనిఖీలు నిర్వహిస్తూ విత్తనాలను నిల్వచేసినా, రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అజాంనగర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా వరి విత్తనాలు నిల్వ చేశారని ఫిర్యాదు అందడంతో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని డీఎస్పీ సంపత్ రావు తెలిపారు. భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్, సబ్ డివిజనల్ ఎస్సైలు, ఏడీఏ శ్రీనివాసరాజు, కాటారం ఎస్సై అభినవ్, ఐదు మండలాల ఏవోలు రామకృష్ణ, ప్రభావతి, సతీశ్, సుధాకర్, మహేశ్, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

లైసెన్స్ డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి

భూపాలపల్లి రూరల్, మే 29 : లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో జరిగే పంట నష్టానికి తగిన పరిహారం పొందవచ్చని భూపాలపల్లి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి డీ సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసీదులు తప్పకుండా తీసుకోవాలని, పంటకాలం పూర్తయ్యేంత వరకు భద్రపరుచుకోవాలని, ప్యాకింగ్ లేని, లూ స్ బ్యాగుల్లో విత్తనాలను కొనొద్దని, గడువు తేదీ, లాట్ నంబర్ తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుంటే 8977714064, 8977714065, 89777 14063 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

గోవిందరావుపేట/ ఏటూరునాగారం/ వెంకటాపూర్, మే 29 : రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర అన్నారు. బుధవారం మండలంలోని మచ్చాపూర్‌లో ఏడీఏ శ్రీధర్ అధ్యక్షతన విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్స్‌లున్న డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మార్పీకి మించి విక్రయించే డీలర్ల సమాచారాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు చేరవేయాలని రైతులకు సూచించా రు. కొనుగోలు సమయంలో బిల్లులు తీసుకొని పంట పూర్తయ్యే వరకు భద్రపర్చాలన్నారు. ఈ సదస్సులో ఏఈవో గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, రైతులు పాల్గొన్నారు. ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి, వెంకటాపూర్ మండలం నర్సాపూర్ రైతు వేదికల్లో ఆయా మండలాల వ్యవసాయాధికారులు వేణుగోపాల్, కల్యాణి రైతులకు విత్తన కొనుగోళ్లపై అవగాహన కల్పించారు. వర్షపాతం 60 మిల్లీ మీటర్లు నమోదైన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌తో సంబంధిత వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోవిందరావుపేట : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ములుగు డీపీవో విజయ్‌చంద్ర

అందుబాటులో జీలుగ విత్తనాలు

మహదేవపూర్/తాడ్వాయి, మే 29 : రాయితీపై అందించే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని మహదేవపూర్, తాడ్వాయి వ్యవసాయ శాఖ అధికారులు ముల్క ల ప్రభావతి, పోరిక జైసింగ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జీలుగ విత్తనాలతో బహుళ ప్రయోజనాలున్నాయని, భూసా రం పెరుగుతుందన్నారు. 30 కేజీల జీలుగ బస్తా రూ. 2,790 ఉం టుందని, రాయితీపై కేవలం రూ.1,116 కే లభిస్తుందని తెలిపారు. కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్‌తో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే వానకాలంలో పంట సాగుచేసే రైతులు వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేసి బిల్లులు పొందాలని వారు సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ముంపు ప్రాంతాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

గోవిందరావుపేట/ తాడ్వాయి, మే 29 : వానకాలంలో జిల్లాలోని ముంపు ప్రాంతాల రక్షణకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ఎస్సీ డాక్టర్ పీ శబరీష్‌తో కలిసి గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్, తాడ్వాయి మండలం ఊరట్టం గ్రామాలను సందర్శించారు. గత వానకాలంలో కురిసిన భారీ వర్షాలను అంచనా వేసి గ్రామంల్లోని పలు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులు, గ్రామస్తులతో చర్చించారు. వాటికి సంబంధించిన పటిష్ట ప్రణాళికలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఊరట్టం గ్రామ సమీపంలోని తూములవాగు వాగుకు ఇరువైపులా ఉన్న భూములు కోతకు గురికాకుండా సీసీ వాల్ నిర్మించడంతో పాటు వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట కరకట్ట నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం పనులు చేపడుతామని, గ్రామస్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ అన్నారు. ఆమె వెంట డీఎస్పీ రవీందర్, ఇరిగేషన్ ఈఈ నారాయణ, డీఈలు శ్రీనివాస్, సదయ్య, ఏఈలు హర్షద్, ప్రశాంత్ తదితరులున్నారు.

వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

సిబ్బంది సమయపాలన పాటించాలి

ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య

మంగపేట, మే 29 : వైద్య సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో అప్పయ్య సూచించారు. మంగపేట పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధి హెల్త్ సబ్ సెంటర్ల ద్వారా అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వేస్తున్న టీకాలు, గర్భిణులు, సంక్రమిత, అసంక్రమిత వ్యాధి గ్రస్తులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ పల్లెల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆశ వర్కర్ల ప్రోగ్రాంకు సంబంధించి పలు సూచనలు చేశారు. గర్భిణులు ప్రతి నెలా అవసరమైన మందులు వాడుతూ, ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని అప్పయ్య సూచించారు. సమావేశంలో వైద్యులు వైశాలి, వేణు, సీహెచ్‌వో సత్యవతి, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చర్చి ప్రారంభ వేడుకలు

చర్చిలో బోధన చేస్తున్న బిషప్ బాల

ములుగురూరల్, మే 29 : మండలంలోని దేవగిరిపట్నంలో నిర్మించిన యేసు తిరు హృదయ దేవాలయ ప్రారంభ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుముల బాల ప్రత్యేక ప్రార్థనలు చేసి చర్చి ప్రతిష్టాపకులుగా క్రైస్తవులతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. కార్యక్రమంలో ఫాదర్ జోసఫ్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి వరద

కన్నాయిగూడెం, మే 29 : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బారాజ్ వద్ద ఎగువనుంచి వస్తున్న గోదావరిలో వరద నీరు తగ్గుముఖం పడుతోంది. బుధవారం బరాజ్ వద్ద నీటిమట్టం క్రమంగా తగ్గుతూ 75.5 మీటర్లుగా నమోదైంది. ఎగువ నుంచి 800 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా ఒక గేటు పైకెత్తి ఉంచి 1000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

కాటారం, మే 29 : వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్షాల పోరాట ఫలితంగా సాధించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని సీపీఎం మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో అట్టి చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 54 లక్షల జాబ్ కార్డుల్లో 1.20 కోట్ల మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారని, డిమాండ్‌కు అనుగుణంగా ఉపాధి కల్పించడం లేదన్నారు. గ్రామంలో 20 పనులను మాత్రమే చేపట్టాలని కేంద్రం చెబుతున్నదని, ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాఇల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. ఉపాధి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు మహిళలకు నెలకు రూ. 2,500, రూ. 4 వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు బొడ్డు కిషోర్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గణపురం, మే 29 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మండలంలోని చెల్పూర్ గ్రామానికి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన కత్తి కుమారస్వామి (65) ఈ నెల 25న రాత్రి గ్రామపంచాయతీ పరిధిలోని కుందయ్యపల్లి వద్ద ఉన్న రేణుక ఎల్లమ్మ గుడి శుభ్రం చేసి ఇంటికి వస్తున్న క్రమంలో మోరంచపల్లి నుంచి చెల్పూర్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ములుగురూరల్, మే29 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో గుర్తు తెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. మహిళ అనారోగ్యంగా ఉండగా ఈ నెల 1న భూపాలపల్లి జిల్లా గణపురం మండలం నుంచి 108 వాహనంలో సిబ్బంది ములుగు దవాఖానకు తీసుకొచ్చినట్లు తెలిపారు. కాగా, ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు 45 నుంచి 50 ఏండ్ల లోపు ఉంటుందన్నారు. శరీరంపై బ్లూ, గ్రీన్ కలర్ నైటీ, ఎత్తు 5 ఫీట్లు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం మృతదేహాన్ని మార్చురీలో ఉంటామని, వివరాలు తెలిసిన వారు 8712670081 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

WANTED

jobs Apply Now!

★అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర:
9392663777, 9246663777, 9290003999.
NT-339514

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న కైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ

కన్నాయిగూడెం, మే 29 : ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని ఐలాపూర్‌లో జరుగుతున్న ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండటంతో పని ప్రదేశంలోని కూలీలకు తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని అధికారులు, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ముందస్తుగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక పరిస్థితిని ఆమె అడిగి తెలుసుకున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల, భీమ్ చిల్డ్రన్ ఫౌండేషన్ ద్వారా నడుస్తున్న పాఠశాలను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సౌకర్యాలు మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఏపీవో వెంకటనారాయణ, ఎంపీడీవో వనిత పాల్గొన్నారు.

గడువులోగా స్కూల్ డ్రెస్‌లు అందించాలి

ములుగురూరల్ : పాఠశాల పునఃప్రారంభానికి ముందే స్కూల్ డ్రెస్‌లు అందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. బుధవారం విద్యాశాఖ అధికారులతో పాఠశాలల అభివృద్ధి పనులు, స్కూల్ డ్రెస్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనులు నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక అవసరాలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఈవో పాణిని, ఐటీడీఏ డీడీ పోచం, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనిన్ , అధికారులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం : ఐలాపూర్‌లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న శ్రీజ

పోలీసుల వాహన తనిఖీలు

గణపురం/ కన్నాయిగూడెం, మే 29: గణపురం మండలం బస్వరాజుపల్లి శివారు ప్రధాన రహదారి గొల్లపల్లి జంక్షన్ వద్ద రెండో ఎస్సై లాల్, కన్నాయిగూడెం మండలం ఏటూరు వద్ద ఎస్సై నరేశ్ ఆ ధ్వర్యంలో బుధవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వచ్చిపోయే వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఇసుక కోసం వచ్చిన లారీలకు కేటాయించిన పార్కింగ్ స్థలంలో కాకుండా రోడ్డుపై ఆపిన వారికి జరిమానా విధిస్తామని లారీ డ్రైవర్లను హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలను నడుపొద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కంచర్ల సతీశ్, టీఎస్ పీఎస్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు ఎదిగి హరిత సింగరేణిగా మారింది

- సింగరేణి సీఎండీ బలరాం



హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

భూపాలపల్లి రూరల్, మే 29 : హరితహారంలో భాగంగా సింగరేణిలో నాటి న మొక్కలు ఎదిగి హరిత సింగరేణిగా మారిందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్, 1000 క్వాటర్స్, కేటీకే-1 ఇంక్లైన్‌లో పర్యటించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల ఎదుగుదలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. సుభాష్‌కాలనీ ఎండీ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నర్సరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ భూపాలపల్లి సింగరేణి పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా ఉండడానికి ఖాళీ స్థలాలు, ఓబీ డంపింగ్, రహదారుల వెంబడి సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో మొక్కలు నాటినట్లు చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద పరిసర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా సింగరేణి మొక్కలు నాటి వృక్షాలుగా పెరిగే వరకు రక్షణ చర్యలు చేపట్టి భావితరాలకు బహుమతిగా అందిస్తున్నదన్నారు. సింగరేణి అనేక విశిష్టమైన హరిత బహుమతులు అందుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట భూపాలపల్లి జీఎం హబీబ్ హుస్సేన్, ఎస్‌వోటు జీఎం కవీంద్ర, ఫారెస్ట్ డీజీఎం బానోత్‌కర్ణ, పీఆర్వో శ్రీకాంత్, డీవై పీఎం శ్యామ్‌ప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి రవికుమార్, ఏరియా అధికార ఇన్‌చార్జి ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయం ప్రారంభమెప్పుడో?

ములుగు జడ్పీ చైర్మన్ కోసం ఏటూరునాగారంలో నిర్మాణం